# అదేమండీ సంగతి!

ఉన్న విషయం చెప్పొద్దూ?

నాకు మహచెడ్డ మోహమాటం!

ఆసంగతి ఒప్పుకోడానికీ మోహమాటమే -

"భలేవారే! అలా మెహమాటపడిపోతారేవిటి?" మరికాసిన్ని లడ్లు వేయించుకోండి" అని ఎవరేనా అన్నారో, తెగమెలికలు తిరిగిపోయి, "హమ్మయ్య! అరలడ్డూకి కూడా చోటులేదు లోపల. ఒడ్డుకి చేరేసింది భోజనం - ఇంకా సొడ్డు వెయ్యడమే తరువాయి" అంటూ అడ్డం పడిపోతా విస్తరికి -

మరి అలాంటప్పుడూ - వెళ్ళిపోతూన్న లడ్డూ బుట్టకేసి బిక్క మొహంతో చూడ్డం ఎందుకు చెప్పండి! జిగురేసి అతికించినట్లు బుట్టకి అతుక్కుపోయి ఎంతలాగినా వెనక్కిరావే చూపులు?

అలాగే కాదుటండీ పెళ్ళయి కొత్తగా అత్తారింటికి వెళ్ళినప్పుడు, మొహమాటానికి పోయి నిక్షేపంలాంటి వెండికంచవుడు జున్నూ పోగొట్టుకొన్నది!

మనలో మనమాట!

నాకు నిజంగా జున్నంటే చాలా ఇష్టం. భోజనకాలే గోవిందనామస్మరణ అన్నట్లు, జున్ను స్వీకరణ కాలే, కంచం గరిటే నాకు స్మరణే కాని, ప్లేటు చెంచా ప్రస్తావన రాకూడదని నా నమ్మకం -

కాని కొత్తపెళ్ళికొడుకుని కాదుటండీ -

మొహమాటపడ్డా - అంతే -

కాని మా బావమరిది రాస్కెల్స్, 'ముప్పయి ఏళ్ళయినా ఈరోజుకి కూడా ఆసంగతి జ్ఞాపకం ఉంచుకొని, "బావగారికి జున్నంటే పడదు" అంటూ నాకళ్ళ ఎదుటే తప్పేలాలకి తప్పేలాలు కాళీ చేసేస్తారు. ఆఫ్‌కోర్స్! జున్ను తినలేదన్న బాధకొద్దీ, ప్రతిసారీ వాళ్ళతోటీ ఏదోఒకటి కజ్జా పెట్టుకుంటాననుకోండి – అది వేరేవిషయం–

మొహమాటానికి పోయి యిలా కొనితెచ్చుకున్నవి ఒకటా, రెండా?

నీలకంఠం ఇంట్లో నాకీనాటికీ నీళ్ళ మజ్జిగే, మీకు తెలుసో లేదో –

వెంకటాపురం వెళితే, వేసవికాలంలో కూడా కాపు వచ్చేలాగా మిద్దె గదిలోనే పక్క–

కావమ్మహోటల్లో అందరికి కమ్మని భోజనం – నాకు మాత్రం ప్రత్యేకంగా మరి కాస్త గొడ్డుకారం వేసి మరీ పెట్టడం.

నేనిప్పుడు పెళ్ళిచేసుకోను అని, ఓ కాలాడిస్తూ కాలరు సవరించుకుంటూ అప్సరసలాంటి అమ్మాయిని చేజేతులా పోగొట్టుకోవడం –

రోజూ సిటీ బస్సులో ఎవరోఒక సీమంతినికి సీటు దానంచేసి ఏడుస్తూ నుంచోవడం–

ఇవన్నీ నేను కొనితెచ్చుకున్నవే, మొహమాటానికిపోయి –

అవునా?

"నమస్కారం మేస్టారూ మరిచిపోయారా?" అనే ఏ పాత విద్యార్థి శాల్తీయో వారానికి ఒకటేనా తగలక మానదు.

అలాంటప్పుడు, "అవునయ్యా మరిచిపోయాను" అని అనొచ్చా? – ఉహుc! నామోషీ ఎంతని?

వెర్రినవ్వొకటి నవ్వి "భలే వాడివే ..... ఊ ... ఇప్పుడెక్కడ?" అంటూ భుజం తట్టడం ఒకటి.

మంచివాడయితే ఏ మచిలీపట్నమో అంటాడు దయతో – ఏడిపించదలుచుకుంటే, "అక్కడేనండీ" అని తిరగటి గురుజు సమాధానం ఓటి, నెత్తిన కొడతాడు.

పోనీ అప్పుడేనా అస్త్రసన్యాసం చేసేసి "చిట్టి తండ్రీ! నీ చిరునామా శలవియ్యి నాయనా, నన్నెందుకు చంపుతావు?" అనొచ్చా?

"ఎక్కడనుంచి రావడం?" అంటూ కూపీ లాగడానికి కుస్తీమొదలెడతా –

వాడేనా తక్కువ తిన్నది?

ఎన్నిమాట్లేడిపించాడో మనల్ని క్లాసులో -

వంటినిండా నూనె పట్టించుకొని కుస్తీకి దిగిన వస్తాదులాగా, "ఇంటి దగ్గర్నుంచేనండి". అంటాడేకాని అంతు చిక్కనియ్యడే!

"పెళ్ళయ్యిందా?" అని అడుగుదాం అంటే ఇంతక్రితం ఎక్కడేనా పిల్లలతో సాక్షాత్కరించినవాడేమో ఖర్మ!

పోనీ, "పిల్లలెంతమంది?" అందామంటే, ఇంకా పెళ్ళి అఘోరించాడో లేదో!

రెండూ కొంపతీసే ప్రశ్నలే -

పిల్లలు కలవాడిని పెళ్ళయిందా అనీ, పెళ్ళికానివాడిని పట్టుకొని పిల్లలెంత మంది అనీ, అడగడంకంటే, లాఠీచార్జీ జరుగుతున్న ప్రదేశం ఎక్కడో వాకబుచేసి, డైరెక్టుగా వెళ్ళి ఆ మధ్య నిలబడ్డం నయం -

అవునాండీ -

ఈమధ్యన ఫేషన్‌కి పోయి, మొపాసా, బాల్‌జాక్ గ్రంథాలు చేత్తోపట్టుకొని ఊరేగడం మొదలెట్టా - అది నా కర్మకాలి, ఇండో ఫ్రెంచి మైత్రీసంస్థ కార్యదర్శి కంటపడింది!

అతగాడు ముక్కూనోరూ మాయంజేసేసి, కళ్ళని మాత్రమే ముఖంనిండా మిగిల్చి, "ఏవిటి మేష్టారూ? మీకు ఫ్రెంచి లేంగ్వేజ్ వచ్చా?" అన్నాడు.

"రాదునాయనా - ఇవి ఫ్రెంచి పుస్తకాలకి ఇంగ్లీషు అనువాదాలు" అంటూ ఉన్న విషయం ఉటంకించవచ్చా? .... ఉహూఁ!

చిరునవ్వొహటి విసిరా -

ఆ చిరునవ్వే కొంపదీసింది.

వేదికమీద అటు ఫ్రెంచి కన్సలేట్ - ఇటు ఫ్రాన్స్ నుంచి తాజాగా దిగుమతి అయిన ఫ్రెంచి రచయితా, మధ్యన జండా కొయ్యలాగ అధ్యక్షస్థానంలో నేను - భారతదేశం నలుమూలలనుంచీ వేంచేసిన ఫ్రాన్స్ జాతీయులు నలభై ఏభైమంది వేదిక చుట్టూ దడికట్టేసి కూర్చున్నారు నా ప్రాణానికి, పారిపోవడానికి వీల్లేకుండా -

అసలే వణికి ఛస్తుంటే మైక్ ప్రకటన ఒహటీ, అధ్యక్షులవారిప్పుడు తన ప్రారంభోపన్యాసాన్ని ఫ్రెంచి భాషలో సాగిస్తారని -

లబ్ మన్న నాగుండె డబ్ అనడం మరిచిపోయింది.

ఒళ్ళంతా చెమటలూ,

చేతులూ కాళ్ళూ వణకడమా,

గొంతు ఎండిపోవడమా,

కళ్ళు చీకట్లు కమ్మడమా,

రక్త ప్రసరణ ఆగిపోయి, నరాలు చిట్లిపోవడమా

ప్రాణంలేని కట్టెలా గిట్టకరుచుకుపోవడమా?

ఒహటేమిటి?

వ్యధాక్షుభిత క్షుధాభరిత వేదనామయ సమయం అది – మరి ఆ గండ కత్తెరలోంచి ఎలా బైటపడ్డానని అడక్కండి – ఎలాగా? ... చటుక్కున కళ్ళుతెరిచేసీ – అవునండీ – గడుసుదనంగా కళ్ళు తెరిచేసి, భయంకరమైన ఆ కలలోంచి అమాంతం ఎగిరి ఒక్క గంతేసి ఇవతల పడ్డాను. లేకపోతేనా – హమ్మో – నాకు తెలియని ఫ్రెంచి భాషలో మాట్లాడవలసి వచ్చేది, ఆ కలలో!

కలల్లోంచి కనక బైటపడ్డాను – కాని మొహమాటంలోంచి ఎలాగండీ బైటపడ్డం? – ఉహూఁ – అంతే – అది అంతే! ఏం చెప్పమంటారు! ... అదండీ సంగతి!

(రచన సచిత్రమాసపత్రిక, 1997)

*